క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్ అందజేత


పద్మకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్‌ను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో అందించారు. మండలంలోని చింతగుంటకు చెందిన మేడవరపు పద్మకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన లక్ష రూపాయల చెక్‌ను అందించారు. మాజీ ఎంపీపీ ముంగమూరి పోలయ్య, సింగపోగు నాగరాజు, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.

రేపటి అమరుల సంస్మరణ సభకు తరలిరావాలి

బేస్తవారిపేట: ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో మార్చి 6వ తేదీన మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు బూదాల ఆనంద్ తెలిపారు. మండలంలోని సలకలవీడులో మాదిగల అమరవీరుల సంస్మరణ సభ వాల్‌పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం 28 ఏళ్ల ఉద్యమంలో ఎందరో ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. దేశంలోని అన్నీ ప్రాంతాల నుంచి సంస్మరణ సభకు మాదిగలు తరలి రావాలని కోరారు. ఎమ్మార్పీస్ యువజన అధ్యక్షుడు వేశపోగు భరణి, సహాయ కార్యదర్శి కువ్వారపు లక్ష్మణ్, నాయకులు కోడెం విజయ్, సీహెచ్ ప్రవీణ్, ఐజాక్ పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో నైపుణ్యం సాధించాలి

కంభం: విద్యార్థులు బోధనోపకారణాలతో నైపుణ్యాన్ని సాధించాలని అకడమిక్ మానిటరింగ్ బృందం సభ్యుడు వెంకట రమణయ్య సూచించారు. స్థానిక రంగావీధి, నాయక్ వీధి, అర్బన్ కాలనీల్లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థి స్థాయిని గుర్తించి విద్యను బోధించాలన్నారు. మధ్యాహ్న భోజన వసతి గురించి తెలుసుకున్నారు. భోజనం రుచి చూశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సభ్యులు వై.వీరనారాయణ, పిచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బషీరున్, వెంకటేశ్వర్లు, సహెరాబేగం పాల్గొన్నారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో శ్రీకాంత్‌రెడ్డి భేటీ

దొనకొండ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి శనివారం తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బైరెడ్డిని శ్రీకాంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. బైరెడ్డిని కలిసిన వారిలో శ్రీకాంత్‌రెడ్డితో పాటు వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల నారపురెడ్డి, మహేష్‌రెడ్డి, ఎంపీటీసీ జాన్ మార్క్ ఉన్నారు.

నాగేటి చాళ్లల్లో ఉద్భవించిన చౌడేశ్వరి అమ్మవారు


అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారి మూలవిరాట్

● రేపు వైభవంగా అమ్మవారి తిరునాళ్ల

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడులో అమ్మలుగన్న అమ్మ ఆదిశక్తి చౌడేశ్వరీదేవి అమ్మవారి వైభవాలు, అమ్మవారి శక్తి గురించి పలు రకాలుగా చెబుతుంటారు. పూర్వం గ్రామానికి పడమర దిశగా ఉన్న పొలంలో నాగలితో దుక్కిదున్నుతున్న రైతు నాగలి కర్రుకు తగిలి రాతి శిల్పం పైకి వచ్చింది. ఆ శిల్పాన్ని గమనించక రైతు గట్టు పక్కన పడేసి ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రి రైతు నిద్రిస్తుండగా కలలోకి వచ్చిన అమ్మవారు తాను దేవతా మూర్తినని, తనను గమనించక గట్టుపై వేశావు.. తనకు గుడి కట్టించి పూజలు చేయాలని చెప్పి అంతర్ధానమైంది. రైతు ఆ దేవత మాటలను గ్రామంలో అందరికీ తెలిపాడు. ఆ మేరకు గ్రామస్తులంతా కలిసి పొలంలో చౌడేశ్వరీ అమ్మవారికి గుడి కట్టించి విగ్రహాన్ని ప్రతిష్టించి నిత్యం పూజలు చేస్తున్నారు. గ్రామంలో 50 కుటుంబాలుగా ఉన్న తొగటవీర క్షత్రియులు నిత్యం అమ్మవారిని కులదేవతగా కొలుస్తుంటారు. రైతు నాగలి చాళ్లలో ఉద్భవించిన దేవత కనుకనే అన్ని వర్గాలకు చెందిన రైతులు చౌడమ్మ తల్లి దీవించమ్మా.. వర్షాలు కురిపించి పంటలు సక్రమంగా పండేలా చూడమ్మా.. అంటూ మొక్కుకుంటుంటారు. ఈ ప్రాంత ప్రజలు తమ బిడ్డలకు చౌడయ్య, చౌడమ్మ, చౌడేశ్వరి అనే పేర్లు వచ్చే విధంగా నామకరణం చేస్తుండటం విశేషం.

రేపు వైభవంగా తిరునాళ్ల

ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున శ్రీచౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. సోమ, మంగళవారాల్లో తిరునాళ్ల నిర్వహణకు గ్రావు పెద్దలు సమాయత్త మవుతున్నారు. దేవాలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. గతేడాది నూతనంగా ఆలయ ముఖద్వారం నిర్మించారు. వేకువ జామున అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పరిసర గ్రామాల ప్రజలతో పాటు విజయవాడ, గుంటూరు,


నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయ ముఖద్వారం

వినుకొండ, పూర్మాపురం ప్రాంతాల నుంచి భక్తులు ఉత్సవాల రోజు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారిని ఆత్మ సాక్షిగా పూజించి కోరికలు కోరితే తప్పక నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవాలు జరిగే రెండు రోజులు గ్రామంలో పండగ వాతావరణం కనిపించనుంది. బంధుమిత్రులతో కలిసి ఉత్సాహంగా తిరునాళ్లను వైభవంగా జరుపుతారు. సోమవారం రాత్రికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. తెల్లవారు జామున జ్యోతుల ఉత్సవం వేడుకగా నిర్వహిస్తారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టనున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం


బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు: జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో మాజీ ఎంపీపీ పోశం కుమార్తెలు సంజన, శ్రీమేఘనకు సంబంధించిన శుభ కార్యక్రమంలో బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పాల్గొని వారికి ఆశీస్సులు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి కూడా పోశం మధుసూదన్‌రెడ్డి, అంజమ్మ దంపతులు కుమార్తెలు సంజన, శ్రీమేఘనలకు దీవెనలు అందించారు.

ఏ-1 గ్లోబల్ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం టౌన్: ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 3న నిర్వహించిన సృజన-2023 జాతీయ స్థాయి పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఏ-1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ తెలిపారు. ప్రేజెంటేషన్ విభాగంలో బీటెక్ 4వ సంవత్సరం సీఎస్‌సీ బ్రాంచ్‌కి చెందిన శృతి, గౌతమి ప్రథమ బహుమతులు సాధించారన్నారు.


విద్యార్థులతో షంషేర్ అలీబేగ్

3వ సంవత్సరం సివిల్ బ్రాంచ్‌కి చెందిన జ్యోతి, షాహీద, పవర్ పాయింట్ ప్రేజెంటేషన్‌లో ప్రథమ బహుమతి కాశింబీ, నాగ ప్రవీణ సాధించినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

సంక్షిప్తంగా

జెడ్పీ స్కూల్‌కు స్థలం కేటాయించాలి

కురిచేడు: మండంలోని పడమర నాయుడుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు భూమి కేటాయించాలని జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. ఆ గ్రామ సర్వే నంబరు 126లో ఎకరం అనుమతి కోసం సంబంధిత అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపామని చెప్పారు. పాఠశాల మంజూరై మూడేళ్లయిందని, నాడు-నేడు ఫేజ్ 2,3లో నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కురిచేడులోని ఎన్ఎస్‌పీ కాలనీలో క్వార్టర్లు నెల రోజుల్లో ఖాళీ చేయాలని అధికారులు నిర్వాసితులకు నోటీసులు ఇచ్చారని ఆయన సమావేశం దృష్టికి తెచ్చారు. ఇప్పటికిప్పుడు వెళ్లాలంటే 180 కుటుంబాల వారు ఎక్కడకు వెళ్లేందుకు అవకాశం లేదని, కొంత కాలం సమయం ఇస్తే ఖాళీ చేసేందుకు అవకాశం ఉంటుందని, కొంత సమయం ఇచ్చేలా ఎన్ఎస్‌పీ అధికారులను ఆదేశించాలని జెడ్పీటీసీ కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. 11 గంటలకు ఆలయం మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కల్యాణానికి ఉభయదాతలు కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేసేందుకు గడువు ఇప్పించాలి


బూచేపల్లికి వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

కురిచేడు: తమ ఇళ్లు ఖాళీ చేయాలని ఎన్ఎస్‌పీ అధికారులు నోటీసులు ఇచ్చారని, వెంటనే ఇళ్లు ఖాళీ చేసేందుకు ఇబ్బందులు ఉన్నాయని, తమకు కొంత సమయం ఇప్పించాలంటూ స్థానిక ఎన్ఎస్పీ కాలనీ వాసులు జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి శనివారం విన్నవించుకున్నారు. అధికారులతో మాట్లాడి సమయం ఇప్పించేందుకు కృషి చేస్తామని వారు భరోసా ఇచ్చారు. అనంతరం కాలనీ వాసులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

దర్శి: చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు జరగవని సీనియర్ సివిల్ జడ్జి జీఎల్‌వీ ప్రసాద్ సూచించారు. స్థానిక సబ్ జైలు, ఎస్సీ బాలికల వసతి గృహాలను శనివారం ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. వారి భోజన వసతి, మెనూను పరిశీలించి భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఖైదీలకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ కావాలని నేరాలు చేసి జైలుకి రారని, క్షణకాలిక ఆవేశంలో చేసిన తప్పులకు జైలుకు రావాల్సి వస్తుందని తెలిపారు. బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సమస్యలు ఏమైనా ఉన్నాయా అని జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉంటే జీవితంలో తప్పులు చేయకుండా ఉంటారని ఆమె పేర్కొన్నారు. న్యాయవాదులు మనోహరమ్మ, సుబ్బారెడ్డి, జైలు సూపరింటెండెంట్ వెంకట రమణ ఉన్నారు.

చట్టాలపై డ్రైవర్లకు అవగాహన తప్పనిసరి

● జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజావెంకటాద్రి

మార్కాపురం: మోటార్ వెహికల్ చట్టాలపై ప్రతి డ్రైవర్ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజావెంకటాద్రి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవర్లు వాహనాలు నడపాలని, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. డ్రైవర్లు తమతో పాటు వాహనంలో ఉన్న వారి ప్రాణాల బాధ్యత కూడా తమదేనన్న భావన కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేని వారికి వెంటనే లైసెన్స్ ఇవ్వాలని మోటార్ వెహికల్ ఆఫీసర్‌ను రాజావెంకటాద్రి ఆదేశించారు. జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, ఆర్‌టీఓ అమర్‌నాయక్ మాట్లాడారు. ఏంవీఐ మాధవరావు, పట్టణ ఎస్ఐ శశికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంది నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య, ఎస్కే ఖాశిం పాల్గొన్నారు.

భక్తి భావంతో మానసిక ప్రశాంతత


ప్రత్యేక పూజలు చేస్తున్న వైవీ భద్రారెడ్డి

తాళ్లూరు: భక్తిభావం కలిగి ఉంటే ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతో ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి అన్నారు. లక్కవరంలోని కాశీ విశ్వేశ్వర (కృష్ణస్వామి) ఆశ్రమాన్ని ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణస్వామి వారికి ప్రత్యేక దీవెనలు అందించారు. మాధవస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి ఆయన్ను సన్మానించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి వలి, మాజీ సర్పంచ్‌లు టీవీ సుబ్బారెడ్డి, టి.శివశంకర్‌రెడ్డి, కరిముల్లా, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులకు మంత్రి తనయుడి పరామర్శ


విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్న విశాల్

● ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ

పెద్దదోర్నాల: కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై క్రమంగా కోలుకుంటున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులను మంత్రి ఆదిమూలపు సురేష్ తనయుడు, జార్జి విద్యా సంస్థల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చేరుకుని సేదతీరుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ భవనాన్ని, అక్కడి వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసరావు, చింతల వైద్యాధికారి యాగ్నిక్‌తో మాట్లాడారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. 10వ తరగతి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బొగ్గరపు రమేష్, చంద్రకాంత్‌నాయక్, గుమ్మా యల్లేష్, ఉపసర్పంచ్ రసూల్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ జోబ్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

మార్కాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ వైఎస్సార్ సీపీ పట్టభద్రుల విభాగం నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. శనివారం మార్కాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన పార్టీ కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సచివాలయ వ్యవస్థతో ప్రజలకు జరుగుతున్న మేలు వివరించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేయాలన్నారు. దీంతో పాటు సుమారు 500ల రకాల సేవలు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్నాయని చెప్పాలన్నారు. పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేకుండా అర్హులకు పథకాలు అందుతున్న విషయాన్ని వివరించాలని ఎమ్మెల్యే కేపీ సూచించారు. మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీకృష్ణ, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, దొడ్డా భాగ్యలక్ష్మి, గుంటక వెంకటరెడ్డి, మారంరెడ్డి కిట్టు, అమీరుల్లా ఖాన్ పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు పట్టణంలోని తన నివాసంలో శనివారం నాయకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పురాయల సీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారి గెలుపు కోసం పట్టభద్రుల ఓటర్లు, ఉపాధ్యాయుల ఓటర్లలో విస్తృత ప్రచారం చేస్తూ వారికి ఓటు వేసేలా పనిచేయాల్సి ఉంటుందన్నారు. నగర పంచాయతీ చైర్మన్ వెంకట సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎన్నికల జోనల్ అధికారి వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ ఉషారాణితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 39 మంది ఉపాధ్యాయులు, 1266 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. వారి కోసం మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సంపత్‌కుమార్‌ను ఆదేశించారు.


కొనకనమిట్ల: తూర్పు, రాయలసీమ నుంచి పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతు ఇచ్చి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచనల మేరకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఉడుముల గురవారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రేగడపల్లి, సిద్ధవరం, కాట్రగుంట, పేరారెడ్డిపల్లి గ్రామాల్లో పట్టభద్రులను కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని అభ్యర్థించారు. సిద్ధవరం ఎంపీటీసీ మీరావలి, ఎల్ఐసీ వెంకటేశ్వరరెడ్డి, రవి, పి.వెంకటరెడ్డి, కందెర పెద్దన్న పాల్గొన్నారు.


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న వెంకట సుబ్బయ్య


కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం తాళ్లూరు మండలంలో తాళ్లూరు, మల్కాపురం పంచాయతీల్లో ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ. వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి వలి, జేసీఎస్ మండల కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి తదితరులు ఇంటింటికీ వెళ్లి గ్రాడ్యుయేట్‌లను ఓట్లు అభ్యర్థించారు.

తర్లుపాడు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిల విజయాన్ని కాంక్షిస్తూ ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు మస్తాన్, పి.వరాలు, రమణరెడ్డి, సచివాలయాల కన్వీనర్ రామాంజనేయ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి తదితరులు శనివారం వివిధ గ్రామాల్లో ఉన్న పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని కోరారు. మండల కేంద్రం తర్లుపాడుతో పాటు సీతనాగులవరం, తుమ్మలచెరువు, కేతగుడిపి, కలుజువ్వలపాడు తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులను వ్యక్తిగతంగా కలిసి ఓట్లు అభ్యర్థించారు.


పెద్దారవీడు: ఓటర్లకు కరపత్రాల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెద్దారవీడు: వైఎస్సార్ సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పెద్దారవీడు, ఏనుగుల దిన్నెపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఓటర్లను కలిసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ, బలుసుపాటి లూథియా, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి కాసు వెంకటరెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ, మండల కన్వీనర్లు ఒద్దుల లక్ష్మీరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ దూదేకుల కాశయ్య, మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాందుగుల సుబ్బారెడ్డి, కొటారు ఆశీర్వాదం, నాయకులు గొట్టం వేణుగోపాలరెడ్డి, బలుసుపాటి నాగరాజు, మారంరెడ్డి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రతినిధులు ఎం.శ్రీనివాసులు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

త్రిపురాంతకం: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13న నిర్వహించనున్న నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను అధికారులు శనివారం పరిశీలించారు. త్రిపురాంతకం జడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన గదులు, మరుగుదొడ్డి సౌకర్యాలను పరిశీలించి సూచనలిచ్చారు. తహసీల్దార్ వి.కిరణ్, సీఐ ఎం.రాంబాబు, ఎస్సై వెంకట సైదులు, ఎంఈఓ కె.తులసి మల్లికార్జుననాయక్, హెచ్ఎం టి.రాజశేఖరరెడ్డి, వీఆర్ఓ శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ముండ్లమూరు: క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. మండలంలోని ఉమామహేశ్వరపురం హైస్కూల్లో భారత రాజ్యాంగం ఆవశ్యకతపై దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసపత్రం, బహుమతులు హెచ్ఎం శ్రీనివాసరావు, డీబీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావులు అందజేశారు. డీబీఆర్‌సీ కమ్యూనిటీ మొబలైజర్ గోపనబోయిన వెంకటరావు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓ ఆకస్మిక తనిఖీ

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మార్కాపురం డిప్యూటీ డీఈఓ ఎ.చంద్రమౌళీశ్వర్ శనివారం ఆకస్మికం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం సక్రమంగా వడ్డించాలని చెప్పారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏసీడీపీఓగా అంజమ్మ బాధ్యతల స్వీకరణ

తాళ్లూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ చైల్డ్ డెవలప్ ఆఫీసర్ (ఏసీడీపీఓ)గా వై.అంజమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టులను పునఃవ్యవస్థీకరణలో భాగంగా తాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుకు మరో రెండు మండలాలు అదనంగా కలిపారు. అధిక కేంద్రాలు ఉండటంతో పర్యవేక్షణ కోసం సీడీపీఓతో పాటు అసిస్టెంట్ సీడీపీఓను ప్రభుత్వం నియమించింది. దీంతో అంజమ్మ బదిలీపై తాళ్లూరు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె మర్యాదపూర్వకంగా ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలను కలిశారు.

భూపతిపల్లి విద్యార్థిని ప్రతిభ


కప్‌తో శిరీష

మార్కాపురం: మండలంలోని భూపతిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని గాయం శిరీష జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాలగురవయ్య శనివారం తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో శిరీష ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. హెచ్ఎం రామకృష్ణ, గ్రామస్తులు ఆమెను అభినందించారు.